



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రగతికి కృషి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో వంద శాతం ప్రగతి సాధించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలలో రక్తహీనత నివారణ, జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల పరిష్కారం, రెండవ దశ రీసర్వే, ప్రాధాన్యత భవనాలు, జాతీయ రహదారులు, మొబైల్స్ టవర్స్, ఉపాధి హామీ, గృహ నిర్మాణం తదితర అంశాలలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జెసి సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గిరీష, డిఆర్ఒ సత్యనారాయణ హాజరయ్యారు. జాతీయ రహదారుల అంశంలో భాగంగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సమీక్షిస్తూ జిల్లాలో నిర్మిస్తున్న మొలకలచెరువు నుంచి మదనపల్లి వరకు ఎన్‌హెచ్-42కు సంబంధించి వంద శాతం భూ సేకరణ చేసి ఎన్‌హెచ్ అధికారులకు అప్పగించడంపై కలెక్టర్ గిరీష పి.ఎస్‌ను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో చేపట్టిన మిగిలిన జాతీయ రహదారులకు సంబంధించి కూడా త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని కలెక్టర్‌కు సిఎస్ సూచించారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచి కల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందులో భాగంగా ముఖ్యంగా అనీమియా నివారణకు ముమ్మరంగా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్నవారికి జగనన్న గోరుముద్ద, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్, బలవర్ధకమైన ఆహారం తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్ సిడి సర్వేలో భాగంగా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లాలోని జాతీయ రహదారులు, ప్రాధాన్యత భవనాల పూర్తికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్స్, ఆర్‌బికెలను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో నాడు - నేడు లో భాగంగా ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్ తదితర ప్రాథమిక మౌలిక వసతులు ఉండాలన్నారు. బాలికల మరుగుదొడ్లకు నీటి వసతి తప్పనిసరిగా ఉండాలన్నారు. పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. రెండవ దశ రీసర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్, విఎస్ లాగిన్ డేటా ఎంట్రీ, తాసిల్దార్ లాగిన్ కంప్లీషన్, సెక్షన్ 13 నోటిఫికేషన్, ఫైనల్ ఆర్ఒఆర్, హద్దు రాళ్ళు నాటే ప్రక్రియలను నిర్దేశిత కాల పరిమితిలో లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కాలనీలలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, రహదారులు తదితర మౌలిక వసతులను ఆయా శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, కెనాల్ ప్లాంటేషన్ లలో నిర్దేశిత లక్ష్యాలలో ప్రగతి సాధించాలని, జాబ్ కార్డ్స్‌కు ఆధార్ సీడింగ్ పక్కాగా చేయాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలపై తగు సూచనలు జారీ చేశారు.

నత్తనడకన సచివాలయ నిర్మాణాలు

జిల్లాకు 414 సచివాలయాలు మంజూరు
253 మాత్రమే పూర్తి
వివిధ దశల్లో మరికొన్ని భవనాలు



గరుగుపల్లెలో నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అన్ని రకాల సేవలు ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలను మంజూరు చేసింది. వాటికి సంబంధించిన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం కావడం, కొన్నిచోట్ల స్థలాల సేకరణ, కోర్టు, పలు కారణాల వల్ల సచివాలయం భవన పనులు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలో 414 సచివాలయ భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 253 భవనాలు మాత్రమే పూర్తి చేశారు. ఐదు భవనాలకు కనీసం పునాదులు కూడా తీయలేదు. వాటికి సరైన వసతి లేకపోవడంతో వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలకు చెందిన భవనాల్లో తాత్కాలిక వసతి కల్పించారు. ఉపాధి హామీ పథకం (కన్వర్జెన్సీ) నిధులతో సొంత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయం నిర్మాణ పనుల బాధ్యతను పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించారు. 2020వ సంవత్సరం మే నేలలో ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున జిల్లాలో 414 భవనాలకు రూ.165.60 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి మంజూరు చేశారు. తరువాత టెండర్లు పిలిచి నిర్మాణ పనులు అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లాలో ఐదు చోట్ల భూవివాదాలు, కోర్టు, కాంట్రాక్టు ముందుకు రాకపోవడం వంటి పలు కారణాలతో పనులు ఇంత వరకు ప్రారంభించలేదు.

తంబళ్లపల్లె నియోజకవర్గంలో 81 గ్రామ సచివాలయాలు మంజూ రయ్యాయి. మట్టి తీసినవి 7, పునాదులు 10, గోడలు 16, స్లాబ్ 33 పూతల 23, పూర్తయినవి 58 ఉన్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 75 సచివాలయంలో మంజూరు కాగా మట్టి తీసినవి 0, పునాది 1, గోడలు 4, స్లాబ్ లో 4, పూతల 16, పూర్తయినవి 46, మదనపల్లి నియోజకవర్గంలో 51 సచివాలయాన్ని మంజూరు కాగా మట్టి తీసినవి 0, పునాదుల 5, గోడల 4, స్లాబ్ 7, పూతల 16, పూర్తివి 18, పీలేరు నియోజ కవర్గంలో 81 సచివాలయాలు మంజూరు కాగా మట్టి తీసినవి 2, పునాదులు 1, గోడలు 1, స్లాబ్ లో 7, పూతలు 17, పూర్తయినవి 52, రాజంపేట నియోజకవర్గంలో 57 సచివాలయం మంజూరు కాగా మట్టి తీసినవి 1, పునాదుల 10, గోడల 0, స్లాబులు 6, పూతలు 4, పూర్తయినవి 35 ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గంలో 73 సచివాలయం మంజూరు కాగా మట్టి తీసిన 0, పునాదులు 1, గోడలు 0, స్లాబ్లు 9, పూతలు 5, పూర్తయినవి 57 సచివాలయాలు పూర్తయినాయి. మిగిలినవి వివిధ దశలలో నిలిచి పోయాయినాయి. ఇప్పటి వరకు 61 శాతం పూర్తయింది. మిగిలిన 39 శాతం పూర్తి కావాలంటే ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందోనని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు కూడా సకాలంలో బిల్లు అందడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ప్రజలకు సూచనలు సలహాలు ఇచ్చేందుకు సరైన ఏర్పాటు లేకపోగా ఇరుకు గదులలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నామని సచివాలయం అధికారులు వాపోతున్నారు. సెప్టెంబర్ చివరికి వంద శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం పేర్కొంటుంది. సకాలంలో ప్రజలకు సచివాలయం భవనాలు పూర్తిస్థాయిలో అవుతాయో లేదో వేచి చూడలిసింది.

నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

జిల్లాలో సచివాలయం భవన నిర్మాణ పనులను సెప్టెంబర్‌కి పూర్తి చేయడానికి నిర్మాణం వేగ వంతం చేస్తున్నాం. మండల ఇంజినీర్లతో వారానికి ఒకసారి సమీ క్షంచి నిర్మాణాల పనులు అడిగి తెలుసు కుంటు న్నాం. ప్రస్తుతం బిల్లు సకాలంలో అందు తున్నాయి. సెప్టెంబర్ నాటికి వంద శాతం సచివాలయాలు భవన నిర్మాణాలను పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకుంటుకున్నాం.



- కె.జె.ఎస్.చంద్రారెడ్డి, పిఆర్ఎస్ఇ, రాయచోటి.



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ లోకవర్ధన్

ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపాలిటీ 21వ వార్డు కె.రామాపురంలోని డాక్టర్ వై.ఎస్.ఆర్.పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఒపి సంఖ్య పెంచాలని, వార్డు వాలంటీర్లు, ఆశాకార్యకర్తలు ద్వారా వై.ఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండే సేవలు గురించి ప్రతి ఇంటికీ సమాచారం అందించాలని అన్నారు. ఆరోగ్య కేంద్రంలో 172 రకాల మందులు, 60 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వీటిల్లో బిపి, షుగర్, మలేరియా, డెంగీ,హెచ్‌బి, హిమతాలజీ, సీరాలజీ, క్లినికల్ పాతాలజీ, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు ఉన్నాయని తెలిపారు. అనంతరం రికార్డులు, ల్యాబ్, స్టోర్స్, లెబర్‌రూమ్, మైనర్ ఒటి గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతీ పట్టణ ఆరోగ్య కేందానికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసుకుని, నెలవారీ సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధికి రోగులకు కావాల్సిన సౌకర్యాలపై తీర్మానాన్ని చేసి నిధులు ఖర్చులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు వాసీమ్,హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగకరం

ప్రజాశక్తి-గాలివీడు

రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సేకరణ కేంద్రం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రాసిక్యూషన్ రాష్ట్ర డైరెక్టర్ జల్లా సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నూలివీడు పంచాయతీలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సేకరణ కేంద్రం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ సేకరణ కేంద్రం నిర్మాణం పూర్తయితే రైతులు పండించినటువంటి పంటలను నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. నూలివీడు చుట్టుపక్కల రైతులకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూలివీడు సర్పంచ్ ఉమాపతి రెడ్డి, ఎంపిటిసి అమానుల్లా ఎఫ్‌పిఒ పదాధికారులు, వైఎస్ఆర్ క్రాంతి పథం సిబ్బంది, సిసి బాలకృష్ణ రైతు మిత్రలు రాజారెడ్డి, రామచంద్ర, సుధాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, అకౌంటెంట్ శ్రీదేవి, శశికళ పాల్గొన్నారు.

టమోటా మార్కెట్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలో న్యూఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం పర్యటించింది. గురువారం మదనపల్లె టమోటా మార్కెట్ యార్డ్‌ను న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ హార్టీకల్చర్ బి.జె.బ్రహ్మ, న్యూ ఢిల్లీ చీఫ్ కన్సల్టెన్స్ మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ ఎస్.కే.కౌల్, జిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్ర బాబు, మదనపల్లె ఉద్యాన అధికారి ఈశ్వర ప్రసాద్ రెడ్డి, ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పరిశీలించారు. మార్కెట్‌కు ప్రతి రోజు ఎంత మొత్తంలో టమోటాలు వస్తాయి, వాటిని ఇక్కడి నుంచి దేశంలోని ఏఏ ప్రాంతాలకు, ఏఏ రాష్ట్రాలకు తరలిస్తారు, టమోటా రవాణాకు ఉన్న సదుపాయాలు, పంట సాగుకు రైతులు అవలంబిస్తున్న విధానాలు, ఏడాది పొడవున టమోటా మార్కెట్‌లో జరిగే లావాదేవీల గణాంకాలను వివరంగా తెలుసుకున్నారు. టమోటా పంట పరిస్థితి మరియు మార్కెట్ పరిస్థితులపై టమోటా కొనుగోలు పద్ధతులను కమిషన్ ఏజెంట్లను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో మండీలను సందర్శించి టమోటా దిగుబడులను క్రెట్లలో రవాణా చేసే పద్ధతులపై ఆరాతీశారు. ప్రభుత్వం హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అన్నమయ్య జిల్లా అధికారులు ఆధ్వర్యంలో మదనపల్లి రూరల్ మండలం వేంపల్లిలో క్షేత్రస్థాయిలో టమోటా రైతులు పంట సాగు చేసే విధానాన్ని పరిశీలించారు. పంట సాగులో రైతులు అవలంబిస్తున్న పద్ధతులను, పెట్టుబడులు ఖర్చుల వివరాలను, మార్కెటింగ్, రవాణా సదుపాయాల గురించి రైతులతో చర్చించారు.



టమోటా పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

భారీగా మొబైల్ ఫోన్ల రికవరీ : ఎస్‌పి



బాధితులకు ఫోన్లు అందజేసిన ఎస్‌పి గంగాధర్‌రావు

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ శాఖ భారీ ఎత్తున రికవరీ చేసింది. ఈ మేరకు రికవరీ అయిన ఫోన్లను బాధితులకు అప్పగించేందుకు గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు మెగా రికవరీ మేళాను నిర్వహించి బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు. 4వ విడతలో సుమారు రూ. 30లక్షల విలువ గల170 ఫోన్లు రికవరీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో నాలుగు విడతలుగా ఫోన్ రికవరీ కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు. ఈ నాలుగు విడతలుగా కలిపి మొత్తం 574 ఫోన్లను రికవరీ చేశామన్నారు. వీటి విలువ రూ.1 కోటి 12 లక్షలు ఉంటుందని పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరి చేసి భాధితులకు అందజేశామని తెలిపారు. మొదటి విడతలో 109 మొబైల్ ఫోన్లు (రూ.23 లక్షలు), రెండవ విడతలో 130 మొబైల్ ఫోన్లు (రూ.26 లక్షలు), మూడవ విడతలో 165 మొబైల్ ఫోన్లు (రూ.33 లక్షలు),నాల్గవ విడతలో 170 మొబైల్ ఫోన్లు (రూ.30 లక్షలు) రికవరీ చేశామన్నారు. రాష్ట్రంలోనేగాక ఇతర రాష్ట్రాల నుంచి బాధితుల ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేశారన్నారు. ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మొబైల్ రికవరీ మేళా నిర్వహించామని చెప్పారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు సైబర్ టీమ్, ప్రతి ఒక్క పోలీసు స్టేషన్‌లో పోలీసులు మొబైల్ ట్రాకింగ్‌పై బాగా పని చేస్తున్నారన్నారు. పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నామన్నారు. మొబైల్ మిస్సింగ్ గురించి ప్రజలు పోలీసు స్టేషన్లకు వెళ్ళడం పై అసౌకర్యంగా ఉందని ఫిర్యాదులు రావడంతో సులభతరమైన పద్ధతిలో మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్ సైట్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఇచ్చామన్నారు. ఏవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే అన్నమయ్య పోలీసు మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్ సైట్‌కి వెళ్ళి మొబైల్ ఫోన్ వివరాలు అందించవచ్చున్నారు. దానిపై వెంటనే సైబర్ ల్యాబ్ బృందం ట్రేస్ చేస్తూ బాధితులకు మొబైల్స్ అందజేసేందుకు కృషి చేసుందని చెప్పారు. పర్సనల్ సమాచారం, జ్ఞాపకాలు, ఎన్నో మొబైల్‌లో ఉంటాయని సెల్ ఫోన్లు రికవరీ చేసి ఇవ్వడం ఆనందంగా ఉందని, జిల్లా ఎస్‌పి, అన్నమయ్య జిల్లా పోలీసులకు సెల్ ఫోన్లు పొందిన లబ్ధి దారులు, బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అండర్ టెక్నికల్ అనాలసిస్ టీమ్ సభ్యులు నరసింహ నాయక్, రవి శేకర్, అబ్దుల్ సాహుల్, షామీన్ అరాస్, ఇలియాస్, చౌడేశ్వరిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రధానోపాధ్యాయుడి కీచక పర్వం

కేసు నమోదు చేయని పోలీసులు
సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యార్థులకు విద్య బుద్దులు చెబుతూ భవిష్యత్‌కు దిశా నిర్దేశం చేయాల్సిన ప్రధానోపాధ్యాయుడు ఆ వృత్తికే కళంకం తెచ్చాడు. విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చి దిద్దాల్సిన టీచర్ కీచక అవతారమెత్తాడు. విద్యార్థినులను వేధించసాగాడు. రాయచోటి పట్టణం రాయుడు కాలనీలోని ఎంపియుపి ఉర్దూ పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకొచ్చిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వేంపల్లి హుస్సేన్ అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, తాకరాని చోట తాకుతూ పైశాచికానందం పొందేవాడని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పారు. వారు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడికి చెప్పులతో దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇరువురు రాజీ పడడంతో పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేస్తూ డిఇఒ పురుషోత్తం ఉత్తర్వులు జారీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : 'గడికోట'

ప్రజాశక్తి - గాలివీడు

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అరవీడులో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని గ్రామంలోని నడింపల్లె అరవీడు కస్పాలలో నిర్వహించారు. కార్యక్ర మానికి హాజరైన ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న పథకాలపై ఆరాతీశారు. సమస్యలు ఏవైనా ఉంటే తెలియ జేస్తే వెంటనే పరిష్క రిస్తామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు, ప్రజా సనస్యలును తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను సిఎం జగన్ నాలుగేళ్లల్లో 90 శాతానికిపైగా నెరవేర్చారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ ఆపకుండా, చెప్పిన సమయానికి ముందుగానే సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. ఆదర్శంగా, పారదర్శకంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందన్నారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తున్నాని చెప్పారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు వేదమూర్తి రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్‌లు ఖాదర్ మోహిద్దీన్(ఎస్.కె), నల్లాబత్తుని వెంకటరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ నిజాంవలి, వైసిపి నాయకులు వేణుగోపాల్, బాబా పక్రుద్దీన్, రామ్మోహన్‌రెడ్డి, మహబూబ్‌షా అహమ్మద్, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లెపు కవితానగేష్, ఎంపిటిసిలు చంద్రప్రకాష్‌రెడ్డి, చిన్నపరెడ్డి, సర్పంచులు చెన్నకేశవరెడ్డి, ఉమాపతిరెడ్డి, ఉమాప్రభాకర్, అరవీటి రెడ్డెమ్మ, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హరినాథ రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



శ్రీకాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-రామాపురం

ఉచిత కంటి వైద్య శిబిరాలు పేదలకు ఒక వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఆవరణంలో గురువారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ పట్టణాల్లో ఉన్న కార్పొరేట్ వైద్యశాలల్లో క్షణం తీరిక లేకుండా వైద్యపరీక్షలు నిర్వహించే అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి (మదురై) డాక్టర్ల బృందం ఉచిత వైద్య శిబిరానికి వచ్చి పేదలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. కంటి వైద్య శిబిరానికి 500మంది హాజరు కాగా అందులో 60 మందికి కంటి ఆపరేషన్లకు అర్హులని అన్నారు. అర్హులైన వారిని వారి సొంత వాహ నంలో తిరుపతి తీసుకువెళ్లారని, ఆపరేషన్ అనంతరం తిరిగి మళ్లీ వారి స్వగ్రామానికి పంపుతారని చెప్పారు. మాజీ ఎంపిపి జనార్దన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, వైసిపి రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, పెద్దిరెడ్డి, చిన్నరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వెడ్డింగ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలో గాలివీడు రోడ్డులోని ప్రీతం రెసిడెన్సీలో రాచావీడు ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెనాన్ ఇండియా వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన వెడ్డింగ్ ఫొటోగ్రఫీ వర్క్ షాప్‌ను గురువారం టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు, టిడిపి నియోజకవర్గ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లుకు ఈ వర్క్ షాప్ ద్వారా ప్రముఖ ఫొటోగ్రఫీ మెంటర్ భూపాల్ కుమార్, కేనాన్ సంస్థ వారు ఇక్కడికి విచ్చేసి మంచి టెక్నికల్ వాల్యూస్ తెలియచేస్తున్నారు అన్నారు. అవి మీరు తెలుసుకొని రాబోయే రోజుల్లో జిల్లా ప్రజలకు నాణ్యమైన షూట్‌ను అందించాలన్నారు. కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, మన్నూరు రాజశేఖర్, మస్తాన్, సహదేవ పాల్గొన్నారు.



నగరవనం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

వేగవంతంగా నగరవనం పనులు : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

రాయచోటి పట్టణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగించేందుకు నిర్మించే నగరవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం గాలివీడు రోడ్డు, అబ్బవరంలో నిర్మించే నగరవనాన్ని , కంచాలమ్మగండిలో బోటింగ్, వాకింగ్ ట్రాక్, తదితర పనులను కలెక్టర్ గిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తర్వాత రాయచోటి పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అందులో భాగంగా గాలివీడు రోడ్డు అబ్బవరంలో దాదాపు 76 ఎకరాలలో నిర్మించే నగరవనాన్ని రూ. 3 కోట్లతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం పనులు బాగా జరుగుతున్నాయని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కంచాలమ్మగండిలో బోటింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నగరవనంలో ముఖ్యంగా చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, నక్షత్ర వనం, చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్ పనులను వేగవంతం చేసి వచ్చే నవంబర్ మాసం నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్రీ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగమనీశ్వరి, తహశీల్దార్ ప్రేమంత్ కుమార్, డివిజనల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రగుశంకర్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రాయచోటి మండల సమావేశం

ప్రజాశక్తి - రాయచోటి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల ప్రజాపరిషత్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన పేర్కొన్నారు. సమావేశానికి ఎంపిపి పల్లపు రాజమ్మ అధ్యక్షులు వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష స్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, జడ్‌పిటిసి, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

త్వరలో క్షేత్ర స్థాయి పరిశీలన

ప్రజాశక్తి రాయచోటి

స్వచ్ఛ సర్వేక్షణ్ (గ్రామీణ్) లక్ష్యాలపై కేంద్ర స్థాయి బృందం త్వరలో అన్నమయ్య జిల్లాలో క్షేత్ర స్థాయి పరిశీలన ఉంటుందని డిపిఒ ధనలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్, కార్యదర్శి, అంగన్వాడీ కార్మికులతో సమావేశమై గ్రామ పంచాయతీకి సంబంధించిన గ్రామ పటం, గృహాల సంఖ్య, ఎస్‌సి, ఎస్‌టి, ఇతరుల వారీగా జనాభా వివరాలు సేకరించి గ్రామంలో పర్యటిస్తారు. హౌస్‌హోల్డ్ స్థాయి, పబ్లిక్ ప్లేస్, గ్రామ స్థాయిలో కార్యక్రమాలు పరిశీలన, బ్లాక్/మండల స్థాయిలో పరిశీలన వీటితో పాటుగా, అన్నమయ్య జిల్లా నుంచి నామినేట్ అయిన 15 గ్రామ పంచాయతీలలో పరిశీలన ఉంటుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, విస్తరనాధికారిలకు కేంద్ర స్థాయి బృందం సందర్శన నిమిత్తం సమాయత్తం కావాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

చేనేతల ఆర్థికాభివృద్ధికే నేతన్న నేస్తం

ప్రజాశక్తి - రాయచోటి

చేనేతల ఆర్థికాభివృద్ధి కోసమే వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని కలెక్టర్ గిరీష పి.ఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న తిరుపతి జిల్లా వెంకటగిరిలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా 2023 - 24 సంవత్సరానికి ఐదో విడతగా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాన్ని రాయచోటి కలెక్టరేట్ నందలి వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, చేనేత లబ్ధిదారులందరి సమక్షంలో వర్చివల్ విధానంలో వీక్షించాలన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2019 నుండి అమలు చేస్తున్న నేతన్న నేస్తం పథకం కింద సొంత మగ్గం కలిగి ఉండి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న చేనేత కార్మికులు అర్హులన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఒక ఇంటిలో ఒక చేనేత కార్మికుడిని లబ్ధిదారుగా పరిగణిస్తారన్నారు. ఒక్కొక్క చేనేత కార్మికుడికి రూ.24 వేలు మంజూరు చేస్తారన్నారు. ఐదవ విడతలోఅన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 6937 మంది చేనేతలకు రూ.16.64కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.



ఆటో సర్వీసులను ప్రారంభిస్తున్న వెంకటరమణ

గంగమ్మ జాతరకు ఉచిత ఆటో సర్వీసులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో గురువారం అత్యంత వైభవోపేతంగా ప్రారంభమైన బలిజపల్లె గంగమ్మ జాతరకు జనసేన రాజంపేట ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ భక్తుల సౌకర్యార్థం ఉచిత ఆటో సర్వీసులను ఏర్పాటు చేశారు. బలిజపల్లెలో ప్రసిద్ధిగాంచిన గంగమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివస్తారు. గంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తుల కొరకు 50 ఆటోలతో ఉచితంగా సర్వీసులను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కత్తి సుబ్బరాయుడు, నాయకులు భాస్కర్ పంతులు, గోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రామమోహన్

నేటి నుంచి ఓటర్ల పరిశీలన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఈ నెల 21 నుండి ఓటర్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభమవుతుందని తహశీల్దారు బి.రామమోహన్ అన్నారు. గురువారం తహశీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని తహశీల్దారులు, రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఓటర్ల పరిశీలనలో రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లు తదితర అంశాల పైన వారి అభిప్రాయాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలకు సంబంధించిన అన్ని విషయాలను వారికి వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు శిరీష, శ్రీధర్‌రావు, పుల్లారెడ్డి వైసిపి నాయకులు జిల్లా రైతు సలహా మండలి ఛైర్మన్ సుకుమార్ రెడ్డి, శివ, టిడిపి నాయకులు వెంకటేశ్వరరాజు,నాయుడోరి రమణ,దుద్యాల జైచంద్ర, అనితదీప్తి, కొమ్మశివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోశాలదేవి, శంతయ్య, జనసేన నాయకులు నాగేంద్ర, సిపిఎ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి - బి.కొత్తకోట



మల్‌రెడ్డి భాస్కర్‌రెడ్డి

రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన మల్‌రెడ్డి భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం రాయచోటిలో జరిగిన ఎస్‌టియు కౌన్సిల్ సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు రాజంపేట సుబ్రహ్మణ్యంరాజు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేసిన తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన పిఆర్‌సి మంజూరయ్యేందుకు చొరవ చూపుతానన్నారు. మదనపల్లి డివిజన్‌కు చెందిన ఎస్‌టియు నాయకులు ఢిల్లీ ప్రసాద్, లక్ష్మీపతి, రాజారెడ్డి, ఆర్.వి.రమణ, పోకల మధుసూదన్, గుర్రంకొండ నరసింహులు, రమేష్‌బాబు, రెడ్డెప్పరెడ్డి, ఎంవి శివారెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు. అనంతరం మండల ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘునాథ్, రమేష్ బాబులు మాట్లాడుతూ ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా తమ మండలానికి చెందిన ఎం.భాస్కర్‌రెడ్డిని నియమించడం సంతోషకరమన్నారు.



బాలికలకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బాలికలకు రక్త నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలికలకు కోనంపేట వైద్య సిబ్బంది గురువారం రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి కుమారి మాట్లాడుతూ బాలికల్లో రక్తంలో హిమోగ్లోబిన్ నిర్ధారణకు రక్తహీనత గుర్తింపు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న బాలికలను గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న బాలికలను గుర్తించి వారికి ప్రతి గురువారం ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లు వేస్తామని పేర్కొన్నారు. బాలికలు పౌష్టికాహారం, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత పెరిగేందుకు మంచి పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పర్యవేక్షకులు సుజేయ కార్తన్, ఉమామహేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వాలంటీర్ మృతి

ములకలచెరువు: పెద్దతిప్పసముద్రం మండలంలోని పట్టెంవాండ్లపల్లె పంచాయతీలో వాలంటీర్‌గా పనిచేస్తున్న తుంగేటి ఆంజనేయులు(36) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆరునెలలుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇంటివద్ద మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఓ గిరిధర్ రెడ్డి, ఎంపిపి మహమ్మద్, జడ్‌పిటిసి శివన్న, అంజినేయులు మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు.

వాల్టా..ఉల్టా..!

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
విచ్చలవిడిగా చెట్ల నరికివేత
ఎవరికీ పట్టని చట్టం
మామూళ్ల మత్తులో అటవీ అధికారులు

ప్రజాశక్తి-పీలేరు

అనుమతి లేకుండా ఒక్క చెట్టును కూడా నరకకూడదు. చెట్లను నరకాలంటే దానికి అధికారుల అనుమతి తీసుకోవాలి. తొలగించిన చెట్లకు బదులుగా మరో చెట్టు వేయాలి. నీటి వనరుల నాశనం కాకుండా వాటి సంరక్షణకు నిర్మాణాలు చేపట్టాలి. మండల స్థాయిలో కమిటీలు నెలకొల్పి సమావేశమై చట్టం అమలును పర్యవేక్షించాలి. ఇవీ స్థూలంగా ఏపి వాల్టా చట్టం (ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్ట్-2004) నిబంధనలు. మండలంలో చట్టానికి తూట్లు పొడిచేలా కొందరు అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం మామూళ్ల మత్తులో జోగుతూ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.

"చెట్లుంటే క్షేమం.. లేకుంటే క్షామం, చెట్లు వానలకు పిలుపు, పర్యావరణ పరిరక్షణకు చెట్లే మూలం, ప్రాణ వాయువుకు చెట్లే ఆధారం" అంటూ నినాదాలు వినిపిస్తున్నా, ఉన్న చెట్లను కాపాడుకుంటూ ప్రతి ఇంటికి ఓ చెట్టు నాటి పచ్చదనాన్ని పెంచాలని ప్రభుత్వాలు ప్రజలకు పిలుపునిస్తున్నా అవి కొంతమంది స్వార్థపరుల చెవుల్లో పడ్డం లేదు. కనీసం పర్యావరణ పరిస్థితులు కూడా వారి దృష్టికి ఆనడం లేదు. కొందరు స్వార్థ పరులు వాల్టా చట్టానికి సైతం తూట్లు పొడుస్తున్నారు. స్వలాభాపేక్షతో వ్యాపారులు పొలాల గట్లుపండే చెట్లను నరికించి వారి వ్యాపారాలను 'మూడు పువ్వులు ఆరు కాయలు' అన్న చందంగా మార్చుకుని అక్రమ కలప రవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. పీలేరు పట్టణ పరిసరాల్లోని ఇటుక బట్టీలకు అవసరమైన కలప వినియోగం కోసం తరలిస్తున్నా, మామూళ్ల మత్తులో జోగుతున్న కొందరు అటవీ శాఖ ఉద్యోగులకు అవి కనబడ్డం లేదు. ప్రతిరోజూ స్థానిక రహదారుల్లో కలప లోడ్ల ట్రాక్టర్లు నడుస్తున్నా వారు పట్టించుకున్న పాపాన పోవడం లేదని కొందరు పర్యావరణ ప్రియులు ఆరోపిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే దానికి వారు సమాధానం కూడా ఇవ్వకుండా అక్కడి నుంచి చల్లగా జారుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయన్న విమర్శలు పట్టణంలో వినిపిస్తున్నాయి.

అటకెక్కిన వాల్టా చట్టం

ఏపీ వాల్టా 2004 చట్టంలోని రూల్ నంబరు 24 ప్రకారం చెట్లు తొలగించాలంటే, మండల స్థాయిలో అయితే తహశీల్దారుకు దరఖాస్తు చేయాలి. ఏ ప్రాంతంలో చెట్లను తొలగిస్తున్నారో పేర్కొనాలి. నివాస, వాణిజ్య ప్రాంతాలు, వ్యవసాయం, పారిశ్రామిక ప్రాంతం పేర్లను స్పష్టం రాయాలి. ఆయా ప్రాంతాల్లో ఎన్ని చెట్లు ఉన్నాయి, ఎన్ని పడగొడుతున్నారు, ఏయే వృక్ష జాతులు ఉన్నాయనేది దరఖాస్తులో పొందుపరచాలి. చెట్లను పడగొట్టడానికి గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలి.



ట్రాక్టర్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న కలప

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించండి



రైల్వేకోడూరు : నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నాయకులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయాల ఎదుట జిల్లా వ్యాప్తంగా విఆర్‌ఎలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు సిఐటియు, వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం విఆర్‌ఎలతో వెట్టి చాకిరి చేయించుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. 11వ పిఆర్‌సి నివేదికలో విఆర్‌ఎల వేతనం పెంపుదల లేకపోవడం అన్యాయమని తెలిపారు. విఆర్‌ఎలకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లవుతున్నా హామీ అమలు కాలేదని విమర్శించారు. నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ విఆర్‌ఎలుగా నియమించాలని కోరారు. అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 65 ఏళ్లు దాటిన, చనిపోయిన విఆర్‌ఎల కుటుంబాలకు కంపాస్ ఇట్ కింద ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను అర్హత కలిగిన వారికి విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, డిఎ పెంపుకు ఆమోదం తెలపాలని, అదేవిధంగా 60 ఏళ్లు దాటిన వారికి విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు కల్పించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షులు కె.లక్ష్మీకర్, సంఘ ఉపాధ్యక్షులు రేవతి, కుమార్, నాగరాజు, రామానుజమ్మ, శివయ్య తదితరులు పాల్గొన్నారు. **కలికిరి:** స్థానిక మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు తమ సమస్యలు పరిష్కారం చేయాలంటూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను అర్హత కలిగిన వారికి విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. **బి.కొత్తకోట :** తమ సమస్యలను పరిష్కరించాలని విఆర్‌ఎలు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు గౌస్ మోదీన్, సి.వెంకటరమణ, వి.నారాయణ, వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్దతివ్వాలని విజయసాయికి వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశ రాజధాని ఢిల్లీలో ఎంపీ విజయసాయిరెడ్డిని విఆర్ ఎస్-ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పోదల నరసింహులు, వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి విఆర్‌పిఎస్ నాయకులు సమావేశమయ్యారు. గురువారం నుండి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి/బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును ఆమోదం పొందేలా డిమాండ్ చేయాలని కోరుతూ ఎంపీ విజయసాయిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తరతరాలుగా వాల్మీకులు నిరాదరణకు గురవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఎస్టీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి,తమ చిరకాల కోరికను నెరవేర్చి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో విఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్, జాతీయ ప్రధాన కార్యదర్శి డిల్లీ రవిందర్ చౌదరి,వాల్మీకి సీనియర్ నేత ఆదోని వెంకన్న, విఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కప్పట్రాల్ల మల్లికార్జున,రాష్ట్ర కార్యదర్శి పత్తికొండ నరేంద్ర, శ్రీనివాసులు, రఘు పాల్గొన్నారు.

'చమర్తి' ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లు పంపిణీ

రాజంపేట అర్బన్ : బలిజపల్లె గంగమ్మ జాతరకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు సహకారంతో జగన్ రాజు యువసేన ఆధ్వర్యంలో గురువారం మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 5 వేల మంచినీటి బాటిళ్లను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బండారు బాలయ్య, జివి సుబ్బరాజు, శేషారెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్, యువ నాయకులు సూర్య నారాయణ రాజు, తెలుగు యువత పట్టణ ప్రధాన కార్యదర్శి సుహేల్, ఎన్టీఆర్ కాలనీ హరికృష్ణ, వినోద్ రెడ్డి, నాగేంద్ర, తులసి, వెంకటేష్ యాదవ్, మణికంఠ, రామారావు నాయుడు, గణపతి, వీరేంద్ర, హరి, చోటు, వెంకటేష్, శుభాన్, సాయి, హేమంత్, ఆరిఫ్, ఖదీర్, సతీష్ పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బ్రాంచ్ మేనేజర్ కిరణ్ మదనపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిని గురువారం సందర్శించారు. ఆసుపత్రిలో జరిగే శస్త్ర చికిత్సలు, రోగులకు కంటి అద్దాల పంపిణీ కోసం లయన్స్ కంటి ఆసుపత్రికి రూ.10 వేల నగదును విరాళంగా అందించారు. ఇందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజరుకి మదనపల్లి లయన్స్ క్లబ్,ఆసుపత్రి తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, ఎంజేఫ్ ఎడిసీఎస్ లయన్ గౌతమ్ రెడ్డి, సెక్రటరీ లయన్స్ సర్వీస్ ట్రస్ట్ లయన్ కె.ఎస్.ఎస్.ప్రసాద్, లయన్ డాక్టర్ నివేదిత, అరుణ్ కుమార్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు ఇస్తున్న పులి శ్రీనివాసులు

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని ఓ వృద్ధాశ్రమంలో గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాసులు జన్మదిన వేడుకను ఘనంగా జరిపారు. గిరిజన యానాది సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక సదుం రోడ్డులోని శ్రీలక్ష్మీ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృదుంధలకు పంచి పెట్టారు. పులి శ్రీనివాసులు వృద్ధాశ్రమానికి బియ్యం, ఉప్పు, పప్పు, కూరగాయలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయతలను పంచాలని కోరారు. మనముండగా తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్చితే, భవిష్యత్తులో మనమూ అదే పరిస్థితులను ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వృద్ధాశ్రమం అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎర్రావారిపాలెం మాజీ ఎంపిపి ఓబులేసు, జె.కొండయ్య, నందలూరు కొండయ్య, యువ యానాది నాయకుడు తిరుపతి లోకేష్, సుబ్బు, జనార్ధనరెడ్డి, ప్రసాద్, ఇస్మాయిల్, శ్రీలక్ష్మీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు విజయకుమారి, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామాపురం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వంద శాతం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సిఎం జగన్ ప్రవేశ పెట్టారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన, జగనన్నకు చెపుదాం కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపిపి మండల వైఎస్‌ఆర్‌సిపి కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వాలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. జడ్‌పిటిసి మాసన వెంకట రమణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో జగన్ ప్రభుత్వం దూసుకు పోతోందన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్ణపు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను మంజూరు చేస్తుండడం హర్షణీయమన్నారు. సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైస్ ఎంపిపి బాబు మాట్లాడుతూ పేదలకు వరంలా జగనన్న సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతోందన్నారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు.



డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు కరపత్రాన్ని ఇస్తున్న ప్రిన్సిపల్ మంజుల

బాలికల విద్య సమాజాభివృద్ధికి మూలం

- రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్

ప్రజాశక్తి-కలికిరి

బాలికల విద్య సమాజాభివృద్ధికి మూలమని రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం వాల్మీకిపురం మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల అడ్మిషన్ల కరపత్రాన్ని మహల్‌లోని తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. బాలికల విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బాలురతో సమానంగా బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక గురుకుల విద్యాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే వాల్మీకిపురం మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో సిబిఎస్ఇ సెంట్రల్ సిలబస్ అమలు చేస్తున్నట్లు, అక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉందన్నారు. తల్లితండ్రులు బాలికలను ఈ పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలన్నారు. బాలికల విద్య విషయంలో పాఠశాల సిబ్బంది కూడా ప్రత్యేక శ్రద్ధతో వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు జిలాని, ఆజం, షఫీ పాల్గొన్నారు.



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న బత్యాల చంగల్రాయుడు

చైతన్య రథాన్ని ప్రారంభించిన 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో మహిళల కోసం కేటాయించిన పథకాల పట్ల అవగాహన కల్పించేందుకు మహాశక్తి చైతన్య రథాన్ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల రాయుడు గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళల్లో మేనిఫెస్టో పట్ల అవగాహన కల్పించేందుకే చైతన్య రథాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మహాశక్తి పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద కుటుంబంలోని చదువుతున్న ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు, దీపం పథకం కింద ఏటా ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో మహిళలందరికీ ఉచిత ప్రయాణం వంటి కనీవిని ఎరుగని పథకాలను టిడిపి ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు నాయుడు, మహిళా నాయకురాలు అనసూయమ్మ, జడ శివ, జ్యోతి శివ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు, స్కూటర్ ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తుమ్మలగుంట రైల్వేస్టేషన్ దగ్గర కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారికి 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ముకుంద రాజు (65), రామకృష్ణరాజు(68) గాయపడిన వారిగా గుర్తించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఆవు చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-ములకలచెరువు

పెద్దతిప్పసముద్రం మండలంలోని రాపూరివారిపల్లెకు చెందిన వెంకటాద్రి ఆవు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల క్రితం అనంతపురం జిల్లాలో రూ.1.20 లక్షలు పెట్టి రెండు ఆవులు కొనుగోలు చేశానన్నారు. ఇంటి వద్ద కట్టి ఉంచగా ఒక ఆవు కనబడటం లేదన్నారు. మూడురోజులుగా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో గాలించినా కనబడలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధిత రైతు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



మృతి చెందిన జితేంద్ర

మండలంలోని జ్యోతి కాలనీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మైసూర్‌వారిపల్లెకు చెందిన కారుమంచి జితేంద్ర(23) అలియాస్ చిన్న మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని రేణిగుంట సమీపంలోని అమర హాస్పిటల్‌లో తరలించారు. ఆయన చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మోటారు బైక్‌పై కుక్కలదొడ్డి గ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బలిజపల్లి గంగమ్మ జాతర

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన బలిజపల్లి గంగమ్మ జాతర గురువారం అంగరంగ వైభ వంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మ వారిని అలంకరించి ఆస్థానంలో ఆశీనులు చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మహి ళలు అమ్మవారికి పొంగళ్ళు సమర్పించారు. కళ్ళు, చీర, పసుపు, కుంకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నిర్వాహకులు అన్ని వసతులను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం పట్టణంలో పలుచోట్ల మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పలువురు రాజ కీయ ప్రముఖులు క్యూ కట్టారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, టిడిపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల రాయుడు, టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బిజెపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి పోతుగుంట రమేష్ నాయుడు, జనసేన ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ, ఆర్‌డిఒ భాస్కర్, డిఎస్‌పి విఎన్‌కె.చైతన్య, పట్టణ సిఐ నరసింహారావు, రూరల్ సిఐ పుల్లయ్య, సబ్ డివిజన్‌లోని ఎస్‌ఐలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి విచ్చేసిన రాజకీయ, అధికార, అనధికార, పట్టణ ప్రముఖులను టి.అగ్రహారం, బలిజపల్లి, నారపురెడ్డి ప్రజలు ఘనంగా ఆహ్వానించి దగ్గరుండి అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. ప్రతి ఏటా బలిజ పల్లె గంగమ్మ జాతరకు లక్ష మంది భక్తులు దర్శనానికి వస్తుంటారని అంచనా. భారీ జన సందోహం మధ్యన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి చైతన్య ఆధ్వర్యంలో సిసి కెమెరాలతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు సిఐలు, 8 మంది ఎస్‌ఐలు, 50 మంది పోలీసులతో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా గంగమ్మ జాతర అత్యంత వైభవోపేతంగా విజయవంతంగా నిర్వహించారు.

